

# అగాధం

స్వామి

పక్కింట్లో అలారం మోగింది. మరొకప్పుడయితే ఆ శబ్దానికి నిద్రాభంగమై విసుక్కుంటూ పక్కకు తిరిగి పడుకునేవాన్ని. కాని ఈ రోజు గంట క్రితమే నిద్రమత్తు వదిలిపోయింది. తెల్లవారుఝామున సూరి తమ్ముడు శీనా వచ్చి తలుపు తట్టి 'మా అన్న చచ్చిపోయె' అని బొంగురు గొంతుకతో చెప్పిపోయినప్పటి నుండి నాలో నాకే ఏదో తెలియని ఉద్వేగం ప్రారంభమైంది.

నేనూ, వాడూ దాదాపు ఒకటే ఈడువాళ్ళం.

సూరి! సూరి చచ్చిపోయాడా? ముప్పై అయిదు కూడా దాటని సూరి ఎంత అకస్మాత్తుగా చచ్చిపోయాడు! నిన్నగాక మొన్న కనిపించినప్పుడు 'ఏం సూరీ! ఇలా అయిపొయ్యావు' అని అడిగితే 'ఇప్పుడు ఇంకా మేలనుకో. కొంచెం కండపట్టి కళగా కనిపిస్తోందాను. నెల కిందట చూడాల్సింది. ఎట్లుండే వాన్నో!' అన్నాడు. 'ఏమి జబ్బు' అని అడిగితే 'క్షయ' అన్నాడు. బాగా కోలుకుంటున్నవానికి హఠాత్తుగా ఏం జరిగి వుంటుంది? ఇంతలోకే చావుకబురా!


సూరి చచ్చిపోయాడని విన్నప్పటినుంచీ నాలో చిత్రమైన నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలోంచి చిన్ననాటి ఒక దృశ్యం పదేపదే కళ్ళముందు మెదుల్తోంది. ఆ దృశ్యమూ, ఆ దృశ్యంతోపాటు వాడు ఇష్టంగా పాడే పాట కూడా నా చెవుల్లో గింగురుమంటోంది.. ... ..

వాడూ, నేనూ, మా పెంపుడు కుక్క రామూ - ముగ్గురం బీడుపడిన మడి కయ్యలోపడి పరుగెత్తుతున్నాం. 'కంకంకం... కంగారు నీకేలనే? ఆహాహా!' అంటూ పాడుతూ పరుగెత్తుతున్నాడు ఎనిమిదేళ్ళ సూరి. రాము మా ఇద్దరి అండా చూసుకుని పట్టలేని ఉత్సాహంతో ముందుకు పరుగెత్తి — మేం ఇద్దరం చిన్నపిల్లలం_దానితోపాటు వేగంగా పరుగెత్త లేకపోవడం గమనించి తోకాడిస్తూ ఆగిపోయి, మేం దాన్ని చేరుకునేలోగా ఒకసారి వీరత్వంతో కాలుదువ్వి, పరిసరాలు చూసి, ఒక బండరాయిపైకి ఉచ్చపోసి ఎవరిదో రాజ్యం ఆక్రమించుకున్నట్లు గర్వంగా తలనిగిడ్చి, నాలుగు వైపులా పరకాయించి చూస్తోంది హుషారుగా.

వాడూ, నేనూ మా చిట్టి చిట్టి కాళ్ళతో పరుగెత్తి దాన్ని చేరుకోగానే అది మళ్ళీ మాతో కలిసి పరుగెత్తుతోంది. నేను పరుగెత్తుతున్నాను అన్నమాటే గాని దూదిపింజలా తేలిపోతున్నాను. బళ్ళో ఓమూల బలవంతాన కూలబడాల్సిన సమయంలో, అట్లా మడికయ్యలకు అడ్డంపడి, మాడ్చే ఎండలో పరుగెత్తడం ఎంతో కొత్తగా, ఉత్సాహంగా వుంది. మాటిమాటికీ ఆకాశంకేసి చూస్తున్నాను. పుస్తకాల మధ్య దాచుకున్న నెమలి కన్నులకు ఆహారం అని ఊహించుకునే అభ్రకపు పొరల్లా వున్నాయి తెల్లని మేఘాలు.

వంక అడ్డమొచ్చింది. నేనూ, సూరిగాడూ దాటే లోపల ఆత్రం పట్టలేక రాము మూడు నాలుగుసార్లు దాటింది అటూ ఇటూ. వంకదాటి రోడ్డుపైకి ఎక్కగానే అక్కడ కల్లమండీలూ, పెద్దపెద్ద దుంగల్నీ, మొద్దుల్నీ సన్నగా కోసిపారేసే మిషన్లూ, రంపపు పొట్టు దిబ్బలూ! అక్కడి నుంచీ ఎర్రని సునికేశుల పూలు చూసుకుంటూ-రోడ్డువారగా ఎత్తుగా పెరిగిన అరు

## విడిప్రతి



సాగుతున్నంత మేరా
పచ్చని చెట్లు
నాటుకుంటూ పోవడం
తప్ప-
తనదంటూ
ఓ తోట
నాటనివాడు
రహదారి ప్రక్కల
వృక్షచ్ఛాయలుగా తప్ప-
బోర్డు తగిలించుకున్న
ఓ పార్కు
కానివాడు
జనహృదయ ప్రాచుర్యమే
తప్ప
ప్రచురణకర్త
కాలేనివాడు
వందలాది కవితలు రాసినా
అందుకుగాను
ఓ సంకలనం
వేయనివాడు
వాడు-
పుస్తకంగా రాని కవి.

—సుధామ

ఏడు చెట్లని దాటిపోతే ఫర్లాంగు దూరంలో శ్రీకంఠం టాకీసు.

కాంపౌండులోకి ప్రవేశించాము. 'నా! నాయినా!' అంటూ అరిచాడు సూరి. ఇంట్లోంచి బైటపడి, ఆ మడికట్లలో నడిచి, వంకదాటి రోడ్డెక్కి టాకీసులోకి రావడం - అదంతా ఏదో ఘనకార్యం చేసినట్లుగా వుంది మా ఇద్దరికీ. నేనూ కేక పెట్టాను. 'చిన్నాయనా!' అంటూ.

సూరి నాయన గేటు దగ్గర నిలబడి టిక్కెట్లు చింపుతున్నవాడల్లా తలెత్తి మావైపు చూశాడు. రాము ఒక్క గెంతు గెంతి అడ్డపంచ ఎగగట్టిన మా చిన్నాయన కాళ్ళని తోకాడించుకుంటూ నాకడం మొదలుపెట్టింది. అతని కళ్ళు మెరిశాయి. 'రండి' అన్నట్లు తల ఊగించాడు. నేనూ, సూరీ ఇద్దరం ఎర్రరంగులో మెరిసే నున్నని సిమెంటు మెట్లెక్కి డోరు దగ్గర చేరాము. 'పొండి లోనికి' అన్నాడు, నన్నూ, సూరీని, రామూను ముగ్గుర్నీ కలిపి అపేక్షగా చూస్తూ. ఎందుకోగాని అతని కళ్ళల్లో గర్వం. నిరునవ్వు పెదాలపై కదలాడుతుండగా తన కోర మీసాల్ని దువ్వుకున్నాడు.

నేనూ, సూరిగాడూ హాలులోకి అడుగుపెట్టాము. చీకట్లో కళ్లు కన్పించక మెల్లగా తడుముకుంటూ పోయి కూర్చున్నాము ఫ్లోర్‌లో. ఏదో నలుపు తెలుపు ఇంగ్లీషు పిక్చర్ ఆడుతోంది. థియేటర్ నిండా సిగరెట్, బీడీల పొగ చుట్టుకుని, అంతా పీలుస్తూ వదిలే ఊపిరితో ఉక్క ఆవరించి, చెమట్లుపోసి తడుముకుంటే, ఒంటికి చల్లగా తగులుతోంది తడిసిపోయిన చొక్కా. అంతా వింతగా గమ్మత్తుగా వుంది. 'బళ్ళో కూర్చోవడం కంటె ఇంతమంది మధ్య కూర్చుని ఇలా మ్యాటినీ చూస్తుంటే ఎంత బాగుంది!' అనుకున్నాము.

కొన్ని వందల మంది జనం సినిమా చూస్తున్న ఏకాగ్రతలోంచి అందరికీ సంబంధించిన ఏదో ఒక వింత భావం పుట్టి, గాఢమై తీవ్రమై మొత్తం సినిమా హాలంతా ఒక ఉత్తేజమై వ్యాపిస్తున్నట్లు అనిపించి ఎవరియందో స్పష్టంగా తెలీని ఒక ఆత్మీయతాభావం మొలకెత్తింది నాలో.

తరువాతి రోజు ముగ్గురు అయిదవ తరగతి చదివే పిల్లలు యమదూతల్లా వచ్చి నన్ను బలవంతాన బడికి ఈడ్చుకుపోయారు. సూరిగాడూ, మా కుక్క రామూ, విశాలమైన ఆ నల్లరేగడి బయలూ, ఆకాశంలో మెరిసే తెల్లమబ్బులూ, ఎండా, వంక దాటడం, ఆ సినిమా హాల్లో ఉక్కతో కలిసిపోయిన పొగ వాసనా... అన్నీ గుర్తొచ్చి నాలోంచి ఏదో తెగిపోతున్నట్లై నేలమీద పడి పొర్లిపొర్లి ఏడ్చాను... .. .. ..

పొలొచ్చాయి. వంటింట్లో గిన్నెల చప్పుడు మొదలైంది. మా అమ్మ ముఖం కడిగి, కాఫీ తాగి బయల్దేరింది. వెళ్ళేముందు ముసుగుతన్ని పడుకున్న నా దగ్గరకొచ్చి 'ఒరే పెద్దోడా!' అంటూ అరిచింది. ఊ... అంటూ మూలిగాను.

'సినిగని పూడ్చేసి వచ్చినంక నువ్వు ఆ మైల బట్టల్తోనే ఇంట్లోకి వచ్చేవు. నేరుగా బాత్‌రూమ్‌కు పోయి మైల బట్టలు అక్కడే ఇడిచేసి నీళ్ళు పోసుకుని ఇంట్లోకి అడుగుపెట్టు. మళ్ళీ చెప్పలేదనుకునేవు. నేను పోతాండా. నువ్వు కూడా బిరింగ రా' అంటూ హెచ్చరించి వెళ్ళిపోయింది.

నాకైతే — 'ఈమె శవం దగ్గర కూర్చొని ఎలా ఏడవగలదబ్బా?' అనిపించి ఆశ్చర్యమేసింది. కాని అక్కడికి పోయాక చాలా రసవత్తరంగా ఏడ్చి తన పెద తల్లి ప్రేమను లోకానికి బాగా వెల్లడించుకోగలదని నాకు బాగా తెలుసు.

జ్ఞాపకాలు ఒక దానికి మరొకటి లింకు సర్వీసులై పరుగెత్తుతుంటే దుప్పటి భుజాల కిందికి బిగించుకుని అట్లాగే పడుకున్నాను. అదే దృశ్యం కళ్ళల్లో మెదుల్తోంది. నేనూ, సూరి, రామూ ముగ్గురం కలిసి పరుగెత్తుతున్నాం, ఆ మిట్ట మధ్యాహ్నపు వాతావరణం నిండా ఉత్సాహం నింపుతూ హుషారుగా... ... ..

మా నాయన, సూరి వాళ్ళ నాయన — ఇద్దరూ చిన్నాయన పెద నాయన కొడుకులు. అంటే వాళ్ళిద్దరూ వరుసకు అన్నదమ్ములు అవుతారు. సూరి నాయన ఏం చదువుకోలేదు. ఇంతలేసి మీసాల్తో, ఎత్తుగా, లావుగా చాలా దర్పంగా వుండేవాడు. ఎప్పుడూ ఎద్దు సొగులనీ, కోళ్ళ పందాలనీ బలాదూర్ తిరిగేవాడు. అతని జులాయి తనానికి ముచ్చట పడేకాబోలు - తనది వేరే కులం అయినా మా సిన్ని మనసిచ్చి మనువాడింది. ఆమె పుట్టింటి నుంచీ ఇల్లూ, చేనూ, తోట, ఎద్దులూ, పాడి పశువులు, పది వేల రూపాయిల నగదూ... అన్నీ కలిపి ఆస్తి బాగా కలిసొచ్చింది. పాడిపంట వృద్ధి కావడంతో మా చిన్నాయన పౌరుషం మరింత విజృంభించింది.

ఒక సంవత్సరం - మా పల్లె రాస్తాదులో జరిగే ఉరుసులో తన కోడెదూడను ఆ ఊరి రెడ్డోల్ల కోడె దూడకు పోటీగా నిలబెట్టాడు. 'తక్కువ కులం నానితో మేం పోటీకి దిగం' అని వాళ్ళు, 'నా కోడెతో పందెంకాసే దమ్ములు మీకు వుంటే కదా!' అని రెచ్చగొడుతూ మా చిన్నాయన. ఆ తగాదా చిలికి చిలికి గాలివానైంది. మా చిన్నాయన గ్రూపులోని మెల్లకన్ను కుళ్ళాయి రెడ్డోళ్ళ జీతగాన్ని పొడిచి చంపడంతో మా చిన్నాయన ప్రథమ నిందితుడుగా జైలుకు పోవలసి వచ్చింది. ఈలోగా కోర్టుల చుట్టూ తిరిగి ఆస్తికూడా హారతి కర్పూరమైంది. పూలమ్మిన చోట కట్టెలమ్ముకోలేక అనంతపురం టౌను చేరాడు. జైలుశిక్ష ఖాయం కావడానికి కొన్ని నెలల ముందు శ్రీకంఠం టాకీసు గేట్ కీపర్‌గా కూడా పనిచేయవలసి వచ్చింది. కాని అప్పటికి గూడా అతడు తన మూతిమీద నిమ్మకాయని నిలిపే మీసాల్ని దువ్వుకోవడం మాత్రం మానలేదు.

సూరిగాడు వాళ్ళ నాయన మీసాల్నీ, పౌరుషాన్నీ వర్ణించి వర్ణించి చెప్పేవాడు. వాళ్లింట్లో ఓ మూలకు పిల్చుకుపోయి 'అదే మా నాయన కత్తి. దాంతోనే ఆ ఊరిగాన్ని పొడిచి చంపింది' అని గర్వంగా తల ఎగరేసి చెప్పేవాడు.

'నాన్ని చంపింది మీ నాయన కాదురా. మెల్లకన్ను కుళ్ళాయి కదా' అని ఎవరైనా సరిదిద్దబోతే వాళ్ళ నాయన శౌర్య ప్రతాపాలకు ఏదో భంగం వాటిల్లినట్లు భావించి 'లేదు లేదు. మా నాయనే చంపింది... నాన్ని' అంటూ దబాయించేవాడు. వాని ప్రతాపం చూసి 'పులి కడుపున పులే పుడుతుంది గాని మేక పిల్లి పుడుతుందా? రాస్తాదు బండీ వాల్లంటే ఏమనుకుందారు మల్ల?' అని ముచ్చటపడేవాల్లు మా చుట్టాలు.

వాళ్ళ నాయన జైలుకు పోయాక సూరి బడి



### అడవి రాముడు

బాపుగారు 'సంపూర్ణ రామాయణం' చిత్రీకరించడానికి రంపచోడవరం అడవులకు వెళ్ళారు.

"మీ వారెక్కడ?" అన్న ప్రశ్నకు బాపుగారి శ్రీమతి జవాబు—


"వనవాసానికెళ్ళారు."

మానేశాడు. 'వానికేం? మొగోడు! చదువు లేకపోతే బతకలేడా?' అంది వీరమాతలాగ మా పిన్ని. రోజులు గడిచేకొద్దీ సూరిగాని ధైర్య సాహసాలు బాగా వెలుగులోకి రావడం మొదలెట్టాయి. నా పిరికితనం వల్ల కాబోలు, దొంగతనం మహాపాపం అనుకునే వాన్ని. సూరిగాడు మాత్రం అది ధైర్యంతో కూడిన పని అనుకునేవాడు. ఇంట్లో చిల్లర డబ్బులు ఎత్తుకొచ్చి మా బడిముందు కాచుకునేవాడు నాకోసం. నేను బయటికి రాగానే దగ్గరకొచ్చి 'మ్యాటినీకి పోదాం రా' అంటూ చెయి పట్టుకునే వాడు. 'నేను రాను పోలే' అనేవాన్ని - మా నాయన తంతాడనే భయంవల్ల. వాడు బడి ఎదురుగా కూర్చొని వుండే సాలమ్మ అవ్వ దగ్గరికి పోయి బఠానీలు, శనిక్కాయలూ, పాగం పప్పూ, పిప్పర మెంట్లూ లాంటివి ఆమె దగ్గర ఏమేమి వుంటే అవన్నీ కొనుక్కొచ్చి నా నిక్కర జేబులో పోసేవాడు. ఒకటో రెండో పిప్పరమెంట్లు నోట్లో వేసుకుని నములుతూ నాతోపాటు నడిచి నేను మా ఇంటి సందు మలుపు తిరగ్గానే వాడు సినిమా హాలు వైపు దౌడు తీసేవాడు. రాత్రి అన్నం తిన్న తరువాత మా ఇంటి అరుగుపైన చేరి టార్జాన్, జింబో నగర ప్రవేశం, హెర్‌క్యులిస్‌లాంటి సినిమా కథలన్నీ చెబుతూ కూచునేవాడు.

'కూసే గాడిద మేసే గాడిదని చెడిపినట్లు— నీకు సదువు కాబట్టదు. వాన్ని సదువుకో నియ్యవు. పోతావా లేదా ఇక్కడి నుంచి' అని మా అమ్మ కసురుకునేప్పటికి, ఏమాత్రం తొట్రుపాటు లేకుండా లేచి నిలబడి మెల్లగా అడుగులేస్తూ వెళ్ళిపోయేవాడు. వాడు భయపడకపోవడం చూసి మా అమ్మ తనకు ఎంతో అవమానం జరిగినట్టు ఫీలయ్యేది. 'భయమూ భక్తీ లేని నా కొడుకు' అంటూ సణుగుతూనే వుండేది. 'వాని జత పడితే నువ్వు కూడా వాని మాదిరే చెడిపోతావు చూడు' అని హెచ్చరించే ది.

అప్పట్లో నా ఊహల్లోని కథానాయకుడు సూరిగాడే. వాని స్వేచ్ఛ, భయంలేనితనం, ముఖంలో నిర్లక్ష్యం అన్నింటినీ పదేపదే తల్చుకుంటూ, బడి చెరలోంచి బైటపడగానే మళ్ళీ వాన్ని చూడగలుగు తాను కదా అని జ్ఞాపకం వచ్చి సంతోషంతో పొంగిపోయేవాన్ని. సాయంత్రం బడి బెల్లు కొట్టగానే ఆకాశం కింద మడికట్లలో గాలిపటం ఎగరేస్తూ ఆడుకునే వాని ముఖమే నాకు గుర్తువచ్చేది. 'నిన్ను బళ్ళో ఎవరన్నా కొడతారా?' అని అడిగేవాడు. 'ఎవరన్నా కొడితే చెప్పు. వాన్ని పిండిపిండి చేస్తాను' అనేవాడు వీరుడిలా పిడికిళ్ళు బిగించి.


ఒక ఆదివారం మధ్యాహ్నం మా ఇంటిమేడ పైకి మెల్లగా మెట్లెక్కి వచ్చాడు సూరి. 'మీ ఇంట్లో వివాహ భోజనంబు పాట రికార్డు వుంది కదా? విందామా?' అన్నాడు. నేను ఏం మాట్లాడకపోతే, 'మెల్లగా పెట్టుకుని విందాంలే' అంటూ ధైర్యం చెప్పి వాకంటె ముందు షెల్ఫ్ అర తీయబోయాడు. అది రాలేదు. పొడవాటి కడ్డీ తెచ్చి షెల్ఫ్ సందులోనికి దూర్చి మెలి తిప్పి బలంగా లాగాడు. అర బైటికి వచ్చింది కాని గ్రాంఫోను రికార్డు




లోపల రెండుగా పగిలి ముక్కలయిపోయి వుంది. దాన్ని అట్లే ఉంచేసి, ఎవరికీ చెప్పొద్దు అని అక్కడ్నుంచి ఉడాయించాడు. సంగతి తెలిసిన మా అమ్మ సూరి అమ్మ మీదికి యుద్ధానికి పోయింది. 'ఈసారి గనక నీ కొడుకు మా ఇంటి వాకిలి దాటి వచ్చినాడంటే చూడు, వాని కాళ్లూ, చేతులూ ఇరిపి పొయ్యిలో పెడతాను' అంటూ వార్నింగ్ ఇచ్చింది.

తరువాత సూరిగాడు మా ఇంటికి రావడం మానేశాడు. మేము టౌన్లోనే మరో మూలకు ఇల్లు మారడంతో వాడు నాకు కనిపించడమే అరుదై పోయింది. కొత్త ఇల్లూ, కొత్త చోటూ, కొత్త బడిలో నాకు కొత్త స్నేహితులు ఏర్పడ్డారు. నాకు అంతవరకూ అందుబాటులోలేని క్రికెట్ ఆట ప్లే గ్రౌండ్‌లో పరిచయం కావడంతో ఆ ధ్యాసలో పడి సూరిగాన్ని దాదాపు మరిచేపొయ్యాను... ... ...

నేను పైకి లేవకుండా ఇంకా అట్లే పడుకో నుండడం మా నాయనమ్మకు భరింపరానిదిగా వుంది. 'బంధువులు సచ్చిపోతే ఏడ్చేంత ప్రేమ మీ కాలం పిల్లోల్లకి ఎట్లా వుండదుగాని పీనిగని చూసేదానికైనా పోవద్దా నాయనా?' అంటూ మెత్తగా సాధించడం మొదలు పెట్టింది. తక్కున మంచం దిగాను. ఆమె



## 'చుట్ట'రికం

సిగరెట్లు పర్మనెంటుగా మానేస్తానన్నారు ఆరుద్ర.

"మానెయ్యడం ఎప్పుడు మానేస్తారు!" అన్నారు ముళ్ళపూడి.

"ఏం లేదు, మా నేస్తం మాలో మళ్ళీ ఎప్పుడు కలుస్తాడో తెలుసుకుందామనీ" అన్నారు మళ్ళీ తనే!

సణుగుడూ, వేధింపులూ, ఇక ఆ దినమంతా అలా సాగిపోతునే వుండి, మరి ఏ విషయాన్ని కూడా శుభ్రంగా తాజాగా ఆలోచించుకోనివ్వవు.

'అమ్మ ముందే పోయిందికదా! ఇక మనం రాలేదని ఎందుకనుకుంటారు?' అన్నాను. ఆ మాటలలోని అంతరార్థం గుర్తొచ్చి మళ్ళీ నేనే నాలుక్కరుచుకున్నాను.

మా అమ్మ ముందుగా పోయి వుంటే మాత్రం నేను పోయినట్లు ఎలా అవుతుంది? కుటుంబం తరుపున మా అమ్మ హాజరయింది. కాబట్టి, లోకం దృష్టిలో మా ఇంటి సభ్యుల అందరి సంతాపమూ, సూరి చావుపట్ల వెల్లడయినట్లే లెక్క. సూరిగానితో స్నేహం వున్న ఒక వ్యక్తిగా కాకుండా వాని చావుకు సంతాపం తెలిపే ఒక ఇంటి సభ్యుడిగా నన్ను నేను పరిగణించుకుంటున్నానన్నమాట.

చావును కూడా సంఘ దృష్టితో చూడడం మొదలు పెట్టి, ఆ చనిపోయిన వ్యక్తి పట్ల తమకు వున్న ఆత్మీయతనూ, ఫీలింగ్స్‌నూ మొద్దుబార చేసుకోవడం ఎంత దయనీయమైన స్థితి! కాకపోతే సూరి గురించి నాలో కలిగే ఆత్మీయతా భావంకన్నా లోకనిందకు వెరచి, వాని శవం దగ్గరకు ఉరుకుల్తో పరుగుల్తో చేరుకుని, అక్కడ నా ఏడ్పును వెళ్ళబోసుకోవడమే ముఖ్యం ఎందుకవుతోంది మా నాయనమ్మ దృష్టిలో.

బయల్దేరబోయాను. అలవాటు ప్రకారం స్నానమూ, కాఫీ రెండూ కూడబలుక్కున్నట్టు గుర్తొచ్చాయి. లుంగీలోంచి ప్యాంటు పైకి ఎక్కించుకుని హాంగర్‌కి వేలాడే చొక్కా తీసి తొడుక్కుంటుంటే వెంటనే ఒక పల్చటి చిర్నవ్వు తారాట్లాడింది, నా పెదాల మీద. నాతో ఒకప్పుడు ఆడుతూ పాడుతూ తిరిగిన సూరి మరణాన్ని నా దేహానికి కూడా ఆరోపించుకుంటూ వున్నందువల్లనేమో, కాఫీ, స్నానమూ, బట్టలు మార్చుకోవడం అన్నీ అర్థంలేని కార్యక్రమాల్లాగా తోస్తున్నాయి.

బాడుగ సైకిల్ తీసుకుని రోడ్డెక్కాను. అదే దృశ్యం... నేనూ, సూరీ, మా కుక్క రామూ పరుగెత్తుతూనే వున్నాం. కంకంకం... అంటూ సూరిగాని పాట. మేము సపోర్టు ఇస్తామన్న భరోసాతో

ఇతర కుక్కలపైకి కయ్యానికి కాలు దువ్వుతూ, కవ్వించిన పందుల్ని తరుముతూ మధ్యమధ్య మా కాళ్ళను ప్రేమగా చుట్టేసుకోబోయే రాము... ఆ దృశ్యం నుంచి పన్నెండేళ్ళ దూరానికి గెంతితే మరికొన్ని జ్ఞాపకాలు ... ... .. ..

బి.ఎ. ఫైనల్‌లోకి ప్రవేశించాను. నెలకో, రెండు నెలలకో ఒకరికొకరం ఎదురుపడినప్పుడు చిర్నవ్వులు చిందించుకుని బాగున్నావా? అంటే బాగున్నావా? అని పలకరించుకునేవాళ్ళం. తరువాత ఏం మాట్లాడాలో తెలియక మా ఇద్దరి మధ్యా నిశ్శబ్దం తాండవమాడేది. వానికీ, నాకూ మధ్య ఏదో అగాధం తొంగిచూసేది.

'ఇప్పుడేం చేస్తున్నావు' అని అడిగేవాన్ని.

జవాబు చెప్పేవాడు.

'ఇప్పుడు ఎన్నో తరగతి నువ్వు' అని అడిగే వాడు.

'బి.ఎ.' అని చెప్పేవాన్ని.

మర్యాదకోసం నవ్వుతున్న మా ముఖాల మధ్య కాసేపు నిశ్శబ్దం.


'పెద్దమ్మ బాగుందా' అని అడిగేవాడు.

చెప్పేవాన్ని.

'నీ తమ్ముడు శివా ఏం పనికి పోతున్నాడు' అని అడిగేవాన్ని.

చెప్పేవాడు, మళ్ళీ కాసేపు నిశ్శబ్దం......

ఇలాంటి ప్రశ్నల్నే మా బుర్రలో అప్పటికప్పుడు తయారుచేసుకుని మా మధ్యకు లాక్కొచ్చేవాళ్ళం. ఆ మాటల్లోనైనా మా మధ్య అగాధం పూడి పోతుందేమో అని మా ఆశ. కానీ, ఆ మాటలూ, పరామర్శలూ అన్నీ కృత్రిమమైనవనే సంగతి ఇద్దరికీ తెలుస్తూనే వుండేది. చిన్నప్పుడు మాట్లాడుతూ కూర్చుంటే గంటలూ, దినాలూ చాలేవి కావు.




## డొక్క శుద్ధి

ఓ ప్రముఖ రచయితకి పొట్ట ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. అది చాలా చిన్న ఆపరేషన్, అయిదు నిమిషాల్లో అయిపోతుందని చెప్పిన డాక్టర్లు అయిదు గంటలు చేశారు. బయట వున్నవాళ్ళు 'ఇదేమిటి, ఇంత ఆలశ్యం' అని కంగారుపడు తుంటే — "అక్షరం ముక్క కోసం వెదుకుతున్నారేమో" —


పొట్టకోసినా అక్షరమ్ముక్క లేదన్న మాటని గుర్తుచేసుకుంటూ అన్నారు ఆరుద్ర.

నాకు సూరి అంటే ఇప్పటికీ చెప్పలేనంత ఇష్టం కాని, ఇప్పుడు మా ఇద్దరి మధ్యా ప్రవహిస్తోంది స్నేహం కాదు, ఆనాటి స్నేహం తాలూకు జ్ఞాపకాలు మాత్రమే!

ఒక రోజు ఇంటికొచ్చి పెళ్ళి పత్రిక ఇచ్చి అంతా రావాలని మరీమరీ చెప్పిపోయాడు. నాకు సూరి పెళ్ళిని చూడడంకంటె వాని పెళ్ళి జరిగే పల్లెకు నా మిత్రులతో కలిసి సైకిళ్ళపై సరదాగా వెళ్ళి రావచ్చు కదా అనే సంతోషమే ముఖ్యమైపోయింది.

పెళ్ళికూతురు ఇంకా పెద్ద మనిషి కాలేదు. వీనికి ఒకటే తొందర. ఆ పిల్ల మెడలో ఇలా తాళి కట్టేసి అలా ఊరిమీద పడ్డాడు - తన నేస్తగాళ్ళతో. అప్పటికి నా క్లాసుమేటు వత్సలను ఒక దేవతగా ఆరాధిస్తూ భావుకత్వంతో ప్లెటోనిక్ లవ్‌లో మునిగితేలుతోన్న నాకు — శారీరక వాంఛతో వాడు ఆడపిల్ల పొందుకోసం చేసే తీవ్ర ప్రయత్నాలూ, గుసగుసలూ... అన్నీ నాకు సంబంధంలేనివిగా తోచి (బహుశా అల్పంగా కూడానేమో) ఇద్దరి మధ్యా మరింత ఎడాన్ని స్థిరపరిచాయి.

కాని, కొన్ని సందర్భాలలో చిన్న సూరి తళుక్కున మెరిసి మాయమైపోయేవాడు నా బుర్రలో. పెళ్లిలో నేను వానికి ఎదురుపడినప్పుడల్లా నేనేదో పవిత్రుడూ, ఉన్నతుడూ అయిపోయినట్టు, వాడేమో చదువూ సంధ్యలు లేకుండా ఉత్త తిరుగుబోతుగా తయారైనట్టు



భావించుకుని సిగ్గుతో నవ్వుతూ ముఖం పక్కకు తిప్పుకుని పోయేవాడు... .. ..

నేను వెళ్ళేటప్పటికి శవం చుట్టూ ఆడవాళ్ళు విశ్శబ్దంగా కూర్చుని వున్నారు. మగవాళ్ళు బయట అరుగులుమీద చేరి మాట్లాడుకుంటున్నారు. సూరి శవం పొడుగ్గా పడుకుని వుంది. వాని కాలి బొటన(వేళ్ళు రెండింటిని దగ్గరగా చేర్చి దారంతో కట్టి ముడి వేశారు. తల పాటున దీపం వెలుగుతోంది. దేన్నో అర్థం చేసుకోవాలనే జిజ్ఞాసతో దీపాన్ని, శవాన్ని మార్చిమార్చి చూస్తున్నాను. కాని, సత్యం కంటె దాన్ని అర్థం చేసుకోవడానికి వీలుగా కల్పించుకున్న సింబల్సూ, మెటఫర్సూ... ఇవే ముఖ్యమైపోయి వీటిల్లోనే ఇరుక్కుపోతుంది మనిషి దృష్టి. ఇక ఎంత ప్రయత్నించినా గ్రాసర్ వరల్డ్‌ను దాటిపోలేదు.

సూరి ముఖం నల్లగా మారిపోయి కళ్ళ దగ్గిరా, దవడల దగ్గిరా గుంటలేర్పడి లోనికి పీక్కుపోయింది. అదిగో మళ్ళీ... నేనూ, సూరి, మా కుక్క రాము- ముగ్గురం పరుగెత్తుతున్నాం. చిన్నప్పుడు ఎలా వుండేవాడు సూరి! గుండ్రంగా బలిసి, నున్నగా టమోటా పండులా మెరిసిపోతూ, నిగనిగలాడే ఉంగరాల క్రాపుతో ఎప్పుడూ నవ్వుతూ ఎంతో ఆరోగ్యంగా వుండేవాడు... ..

వాడే, వాడే... నా నేస్తగాడు సూరి - నా ఊహల్లోని కథా నాయకుడు సూరి! 'ఏరా! మనతోటి గెలిచే వీరులెవ్వరురా? శూరు లెవ్వరురా?' అంటూ పాడుతూ జబర్దస్తీగా తిరిగే సూరి!! కాని, కాని... గాంధీ శత జయంతికి విడుదలై వచ్చి జైల్లో సోకిన క్షయ వ్యాధితో మూడు నెలలు మంచంపట్టి చచ్చిపోయాడు సూరినాయన. అదే వ్యాధి సోకి మరుసటి సంవత్సరమే చచ్చిపోయింది తల్లి. చేరదీసే వాళ్ళు లేక అల్లరి చిల్లరిగా తిరిగి, పెరిగి పెద్దై, ఇరవై ఏళ్ళకు పెళ్ళాడి ఇరవై రెండు దాటకుండా ఇద్దరు పిల్లలకు తండ్రై, సంసారం జరగక, చిరుగుల చొక్కా తొడుక్కుని కూరగాయల బండి తోసుకుంటూ వీథివీథికీ, గడపగడపకూ అరుచుకుంటూ తిరిగే సూరి...అనుకోకుండా ఎదురై ముఖం చాటు చేసుకుని పోతున్నాడు. 'సూరీ' అంటూ పిలిస్తే ఆగాడు. 'ఏం సత్యనారాయణ!బాగున్నావా?' అన్నాడు ఏదో నేరం చేసినట్లు బిడియపడుతూ.

మా ఇద్దరి నడుమా అదే అగాధం.

నా చదువూ — వాని పనీ...

నేను తొడుక్కున్న బట్టలూ — వాడు మాసిన అడ్డ పంచమీద తొడుక్కున్న చిరుగుల చొక్కా ···

నా చేతిలో ఒక లావుపాటి పుస్తకం. వాని రెండు చేతులలోను తోపుడు బండీ...

ఇంకా ఏవేవో తేడాలూ, కృత్రిమమైన విలువలూ మా ఇద్దరి మధ్యా కల్పిస్తోన్న అగాధం. మేం బాల్యంలో గడిపిన రోజుల్ని తలచుకుని, మేం చేసిన అల్లరి పనులూ, ఆడిన ఆటలూ, జరిగిన సంఘటనలూ... అన్నిటినీ జ్ఞాపకాల్లోకి తిరగదోడుకుని - వాటితో మా మధ్య ఏర్పడిన అగాధాన్ని పూడ్చేసుకుని, స్నేహాన్ని పునరుద్ధరించు కుందామనిపించింది.



## అభిమాన ధాను

"ఈ ధాను నా శ్రుతిలో కలుస్తోంది" అన్నా డొకాయన ఫిష్ మోతతో శ్రుతికలుపుతూ.

"ఎవళ్ళ ధాన్లు వాళ్ళ శ్రుతిలోనే వుంటాయి. ఎంచేతంటే అవి మనకి ధాన్లు కదా" అన్నారు ఆరుద్ర.

కాని, మా మధ్య ఏర్పడిన ఈ అగాధం జ్ఞాపకాల నీడల్తో పూడిపొయ్యేదేనా?

ఎక్కడో లోపం వుంది. ఇద్దరమూ దేనినో పోగొట్టు కున్నాం. నేను 'ఒరే సూరిగా' అని పిల్చినా, 'ఏంరో సత్తిగా' అని వాడు బదులు ఇచ్చేట్టు కన్పడలేదు.

ఇప్పుడే కాదు, చిన్నప్పుడు కూడా వుంది మా మధ్య విలువల తారతమ్యం. కానీ వానితో కలిసి నవ్వడానికీ, మాట్లాడడానికీ, ఎగరడానికీ, దూకడానికీ, ఆడుకోవడానికీ ఆ విలువలూ, తారతమ్యాలూ ఏవీ అడ్డు రాలేదు. బాల్యాన్ని కోల్పోయాక మాత్రమే మనిషిమంచీ మనిషి దూరం కావడం ప్రారంభిస్తాడు.

ఏడ్చి ఏడ్చి అలసిపోయి పట్టిపోయిన హృదయంతో బండరాయిలా కూర్చునుంది సూరి భార్య. శవాన్ని చూడడానికి వచ్చినవాళ్ళంతా ఆమె ముఖాన్ని పరిశీలించి చూసి పోతుంటే, అట్లా ఏడవకుండా కూర్చోవడం ఆమెకు బాగున్నట్టు లేదు. ఏడ్పు తెరలు తెరలుగా అలా అంతం లేకుండా పొంగుకు వస్తూనే వుంటే ఎంత బాగున్ను అని అనిపిస్తోందేమో! లేకపోతే అట్లాంటి ఏడ్పు నాకొస్తే బాగున్నని కోరుకుంటున్నానా?

బైటకొచ్చి చుట్టాల మధ్య కూర్చున్నాను.

'ప్చ్! మొగోడంటే వాడేరా! పదిమంది మీదికి వచ్చినా సరే.'రాండ్లే! ఈ పొద్దు మీరో నేనో తేలిపోవల్ల' అంటా ఒక్కడే గొడ్లి చేతిలో పట్టుకుని ఎదురు నిలిచే మొగోడు... వాడు తప్ప ఎవ్రరా మన బండీవాల్ల వంశంలో' అని అలాంటివే ఇంకా కొన్ని బిరుదులూ, పొగడ్తలూ!

'ఇంకా ఏమిటి ఆలస్యం? జరగాల్సింది చూడక. ఇంట్లో ఇల్లు పీనిగని పెట్టుకుని ఎంతసేపుంటారు, కూడూ నీళ్ళూ లేకుండా' అన్నారెవరో!

'వాని అత్తమామలు రావల్లకదా పాపం. ఈ పాటికి వస్తానే వుంటారులే' అన్నాడు నా పక్కనున్న బంధువు.


నేను హోటల్‌కు పోయి కాఫీ తాగి తిరిగి వచ్చేటప్పటికి ఇంటి అరుగుల మీద జనం పలచబడ్డారు. ఒకచోట ముగ్గురు బంధువులు గొంతు తగ్గించి మాట్లాడుకుంటున్నారు.

'ఈ సూరిగాడు భలే నాయాలు. ఊరినిండా అప్పులు చేసి ఎన్నిసార్లు అడిగినా అదిగో ఇప్పుడిస్తాను. ఇదిగో ఇప్పుడిస్తాను అని గడువుమీద గడువు పెట్టి సతాయిస్తాండె. ఇల్లు మెత్తగా వుంటే సరిపోదనుకుని అప్పులు ఇచ్చిన ఆసాములు పదిమందీ కూడబలుక్కొని కట్లు తీసుకుని వాని ఇంటిమింద పడిరి,'మా బాకీలు తీరుస్తావా? లేక చస్తావా?'అని.అప్పుడు దగ్గుకుంటూనే బైటకొచ్చి ఈ సూరిగాడు ఏమన్నాడో తెలుసా?

'మీరు మర్యాదగా అడిగింటే నా తల తాకట్టు పెట్టి అయినా సరే మీ అందరి అప్పులూ తీర్చేవాన్ని. ఇప్పుడు మీరంతా ఆ మార్గం కాదని ఈ మార్గంలో వచ్చినారు కాబట్టి నా సమాధానం కూడా ఈ మార్గంలోనే' అని నిబ్బరంగా జవాబుచెప్పి, గొడ్లి చేతిలో పట్టుకుని ఒక్కడే ఎదురు నిలబడె. గొంతు పెంచి, 'ఒక్కనికీ ఒక్క పైసా కూడా అప్ప కట్టేది లేదు. ఏం చేసుకుంటార్లే మీరంతా. మీసమున్న మొగోడెవరో రండిలే ముందుకు' అని గొడ్లి పైకెత్తి ముందుకు దూకె. 'అమ్మ! ఏం నా కొడుకురా వీడు? ఏం లౌక్యం? ఏం తెగింపు? ఎంత దగా? ఎంత మోసం?' అంటూ సూరిగాడు చేసిన మోసాలూ, కుట్రలూ, వెంగబెట్టిన దొంగ లౌక్యాలూ... అన్నీ ఏకరువు పెడుతున్నాడు.

కష్టపడి పనిచేయడానికి శక్తిలేక, ఆరోగ్యం లేక, బ్రతకడంకోసం, పెళ్ళాం పిల్లలకు ఇంత తిండి పెట్టడంకోసం మరో మార్గంలేక సూరిగాడు చేసిన అన్యాయాలూ, దౌర్జన్యాలూ అన్నీ చిన్నప్పుడు వాడు చేసిన అల్లరి పనులూ, ఆకతాయి చేష్టలుగానే కన్పించాయి నాకు.

లోకంలో కన్పించే ఈ దుర్మార్గమంతా మనుషుల



బాల్యచాపల్యం లాంటిదే అన్న సంగతిని మరచిపోయి, ఎందుకు ఉద్రేకపడతారో మరి చాలాసార్లు.

మధ్యాహ్నం పన్నెండు గంటలకు పక్క ఊరి నుంచి సూరి అత్తమామలు దిగడంతో వాతావరణ మంతా మరోసారి ఏడ్పుల్తో నిండిపోయింది. శవాన్ని అలంకరించి పంపడానికి సాంప్రదాయికంగా అవసరమయ్యే సరంజామాను తెప్పించే ప్రయత్నంలో అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నారు. తప్పెట్ల మోతలో ఒకరి గొంతు ఒకరికి సరిగా వినిపించక పదేపదే గట్టిగా అరుస్తూ మాట్లాడుతున్నారు. అంతవరకూ అక్కడ పేరుకున్న నిశ్శబ్దం తటాలున కరిగిపోయి కోలాహలమై ఊగింది - ఒక పెద్ద బండరాయి పడిన బావిలో నీటి లోతుల్లాగా!


శవాన్ని తుది స్నానం చేయించారు– నవారు మంచానికి నాలుగువైపులా కంబళి చుట్టి. శవస్నానపు నీళ్ళు నా కాళ్ళ కిందికి వచ్చి తాకుతున్నాయి చల్లగా.

సూరి శవాన్ని పాడెకు బిగించి కట్టారు. నోట్లో తమలపాకులు కుక్కారు. ముఖం నిండా పసుపూ, కుంకుమలు చల్లారు - గుర్తుపట్టడానికి వీల్లేకుండా.

మోస్తున్నాను.

సూరి శవాన్ని మోస్తున్నాను.

ప్రేమతో కుప్పించి గుండెల మీదికి ఎగిరే మా రామును ఏనాడో అనంత కాలగర్భంలోకి నిర్దయగా ఈడ్చుకుపోయింది మృత్యువు. అదే మృత్యువు ఈ దినం సూరిని లాక్కుపోయింది. మేం ఆడుతూ




**పరామర్శ**

అని 'బంగారు తల్లి' సినిమా నిర్మాణం జరుగుతున్న రోజులు. షూటింగ్‌లో గుర్రం మీంచి పడి హాస్పిటల్ పాలయిన కృష్ణంరాజుని పరామర్శించడానికి వెళ్ళారు ఆరుద్ర.

"చెయ్యి కొంచెం వంకరయింది — అయినా ఫరవాలేదులెండి, చెయ్యి తిరిగిన నటులయ్యారు" అని ధైర్యం చెప్పారు ఆరుద్ర.

పాడుతూ తిరిగిన అదే నల్లరేగడి బయల్లో, ఆ రోజులాంటిదే నెత్తిమాడ్చే ఎండలో సూరిని శ్మశానానికి మోసుకుపోతున్నాను.

మోస్తున్నాను.

శవాన్ని మోస్తున్నాను.

దూరం నుంచీ చూడగానే కన్పించే

ఎత్తైన గిరి శిఖరంలా

గుడి గోపురంలా—

బాల్యాన్ని తలచుకోగానే

మొట్టమొదటగా గుర్తుకొస్తున్న అదే దృశ్యం!

ఆత్మకు ఎంతో దగ్గరగా బతికిన బాల్యం నాటి గొప్ప రోజులకు నేపథ్య సంగీతంలా ఇంకా వినిపిస్తూనే వుంది సూరిగాని పాట.

సూరిగాడంటే నా బాల్యమే! బాల్యం నాకేమో అవుతుంది. అవును. నాకు నిశ్చయంగా తెలుసు—

బాల్యమంటే వయసుతోపాటు వెళ్ళిపోయేది కాదు.

మొత్తం జీవితమంతా పరుచుకునే వెలుగు!

అవసరాలకు అతీతమైన సంబంధం.

ఒక నిర్నిమిత్తపు ప్రేమ.

మనిషికీ మనిషికి మధ్య

సంబంధాల్లో—

ఈ బాల్యమే

ఈ అమాయక చైతన్యమే

ఎప్పుడూ గంతులేస్తూ వుండాలి.

లేకపోతే — ఏ మానవ సంబంధమూ తనను కృత్రిమత్వపు కోరల్లోంచీ కాపాడుకోలేదు.

మోస్తున్నాను

శవాన్ని మోస్తున్నాను.

జ్ఞాపకాన్ని మోస్తున్నాను.

కాని — శవాన్ని పాతిపెట్టి ఇంటిదారిపట్టగానే, జీవితం హఠాత్తుగా బరువు కోల్పోయి తేలిక పడినట్లైె ఏదో మెత్తగా సహజంగా నన్ను ఆవరించుకుంది.

